## ధాన్యం తరలించాలని రోడ్డెక్కిన రైతులు

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు సోమవారం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చిట్కుల్‌లో రోడ్డెక్కారు. మెదక్-సంగారెడ్డి రహదారిపై రైతులు బైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ధాన్యాన్ని తరలించకపోవడంతో వర్షానికి తడిసి మొలకలు వస్తున్నాయని, అదీగాక బస్తాకు మూడు కిలోల తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ధాన్యానికి నిప్పంటించి నిరసన తెలిపారు. పోలీసులు అక్కడికి చేరుకొని తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీతో శాంతించారు. - చిలిపిచెడ్





మెదక్ జిల్లా శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# నెలరోజులైనా ధాన్యం కొనరా?

శివ్వంపేట, మే 19 : కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించి నెల రోజులవుతున్నా కాంటా వేయడం లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం మెదక్ జిల్లా శివ్వంపేటలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఓవైపు అకాల వర్షాలు పడుతుండటంతో ధాన్యం తడుస్తున్నదని, పంటను కాపాడుకోవడం ఓ వంతైతే కాంటా వేయడం మరోవంతుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు ధాన్యం మొలకలు వస్తున్నాయని ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రం వద్ద కనీస వసతులు లేవని, వెంటనే అధికారులు వచ్చి తమకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై కూర్చున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సై మధుకర్‌రెడ్డి రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.



మెదక్ జిల్లా శివ్వంపేటలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## తడిసిన ధాన్యాన్ని కొనాలి: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**వర్షాలకు** తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శివ్వంపేటలో రైతులు ఆందోళనకు దిగిన విషయాన్ని తెలుసుకొని అక్కడికి చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగు రోజులకో లారీ మాత్రమే లోడ్ చేస్తే కొనుగోలు ఎప్పుడు పూర్తి చేస్తారని నిర్వాహకులను ప్రశ్నించారు. లారీల సంఖ్యను పెంచడంతోపాటు అదనంగా హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యంపై ఫైర్



ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ధాన్యం విక్రయానికి తరలించి నెలలు గడుస్తున్నా నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. -తిరుమలాయపాలెం

## గన్నీ బ్యాగులు ఇయ్యరు.. ధాన్యం కొనరు



కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు ఇవ్వడంలేదని, ధాన్యం కొనడంలేదని వనపర్తి జిల్లా చిన్నమందడిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనేవారు లేరని, వర్షాలకు ధాన్యం తడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహంవ్యక్తంచేశారు. వర్షానికి ధాన్యం తడిచి మొలకలు వస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. -పెద్దమందడి

## ధాన్యం డబ్బులు ఇంకెప్పుడిస్తరు?



ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా ఖాతాల్లో డబ్బులు పడలేదని రైతులు ఆందోళనకు దిగారు. నారాయణపేట జిల్లా మక్తల్‌లో రాయిచూర్-మహబూబ్‌నగర్ రహదారిపై ధర్నా చేశారు. సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదురవుతున్నా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తంచేశారు. చాలాచోట్ల కనీసం గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. -మక్తల్

## కాంటా ఎప్పుడు పెడ్తరు?



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పెద్దతూండ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కాంటాలు పెట్టి ధాన్యాన్ని వెంటనే తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. -మల్హర్



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో జొన్నలను కాంటా చేస్తున్న కూలీలు

# జొన్నల కొనుగోళ్లలో దోపిడీ

- సంచి బరువు పేరిట కిలో అధికం
- రైతులు నష్టపోతున్నా పట్టించుకోని అధికారులు

ఆదిలాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో జొన్న రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. కొనుగోళ్లలో జాప్యం, అకాల వర్షాల కారణంగా నష్టపోతున్న రైతులు, పంట కొనుగోళ్లలో కోతల కారణంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొన్నది. యాసంగిలో రైతులు సాగు చేసిన జొన్నలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సేకరిస్తున్నది. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. జిల్లాలో పది కొనుగోలు కేంద్రాల్లో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,371 చొప్పున పంటను తీసుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు జొన్నలను క్వింటాల్‌కు రూ.2,600 ఇస్తుండటంతో రైతులు ప్రభుత్వ కేంద్రాలకు పంటను తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు జొన్న రాశులతో నిండిపోతున్నాయి. నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. క్వింటాల్‌కు కేజీ అధికంగా తూకం వేస్తుండటంతో నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. సంచి బరువు ఎంత ఉంటే అంతే పరిమాణంలో జొన్నలను తీసుకోవాలని కోరుతున్నారు.

### కోత విధించకుండా చూడాలి

*నేను 27 క్వింటాళ్ల జొన్నలను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన. సంచిలో 50 కిలోలు నింపి కాంటా చేయాల్సి ఉండగా 51 కిలోల వరకు నింపుతున్నారు. ఖాళీ సంచి బరువు 600 గ్రాముల వరకు ఉంటుంది. 350 నుంచి 400 గ్రాములను ఎక్కువగా తీసుకుంటున్నారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది.*

**- రాములు, రైతు, మావల, ఆదిలాబాద్**

# కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై దాడి

- కాంగ్రెస్ నేత అనుచరుల దౌర్జన్యం
- ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

గణపురం, మే 19 : కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై కాంగ్రెస్ నాయకుడి అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా బుర్రకాయలగూడెంలో సోమవారం చోటుచేసుకున్నది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. రెండు కేంద్రాల నిర్వాహకుల మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని



మిషన్ భగీరథ నీటితో తడపడంతో నిర్వాహకులు సదరు నేతపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మహిళలు ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లగా మాజీ ఎంపీటీసీ అనుచరులు గొడవకు దిగారు. మహిళలపై దాడి చేయడంతో రేణుక, శ్రీదేవికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోవడంతో స్థానికులు 108 వాహనంలో భూపాలపల్లిలోని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం రేణుక అపస్మారక స్థితిలో ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

# మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- దిగుబడి లేక.. ధర రాక పత్తి రైతు
- రింగ్‌రోడ్డులో భూమి పోతున్నదని మరో రైతు
- ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లో విషాదం



కొక్కుల లచ్చన్న



నర్సింహులు

జైనథ్/గజ్వేల్, మే 19 : దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతు, రీజినల్ రింగ్ రోడ్డులో భూమి పోతున్నదని సిద్దిపేట జిల్లాలో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలం సుందరగిరి గ్రామానికి చెందిన రైతు కొక్కుల లచ్చన్న (56) తనకున్న రెండున్నర ఎకరాల్లో పత్తి వేశాడు. సాగుతోపాటు బిడ్డ పెండ్లికి రూ.15 లక్షల వరకు అప్పు చేశాడు. ఆశించిన మేర దిగుబడి రాకపోవడం, పత్తి పంటకు ధర లేక తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. దీంతోపాటు ఆయనకున్న రెండున్నర ఎకరాలు పోడు భూమి కావడం, దానికి పట్టా లేకపోవడంతో మరింత ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సుందరగిరి గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లచ్చన్న భార్య ప్రేమల ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్సై రమ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**భూమిపోతే ఎలా బతకాలని**

రీజినల్ రింగ్ రోడ్డులో వ్యవసాయ భూమి పోతుందనే బెంగతో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మక్తమాసాన్‌పల్లికి చెందిన రైతు ఇసకంటి నర్సింహులు (45)కు రెండు ఎకరాల భూమి ఉన్నది. వ్యవసాయం మీదే ఆధారపడ్డాడు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం దాదాపు ఎకరన్నర కంటే ఎక్కువే పోతుందని, దాదాపు ఉన్న భూమి అంతా పోతే సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్రమనస్తాపం చెందాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.



జనగామలోని గాయత్రి గార్డెన్ వద్ద నాగపురి, కొమ్మూరి వర్గీయుల బాహాబాహీ

# జనగామ కాంగ్రెస్‌లో వర్గపోరు!

జనగామ, మే 19 (నమస్తే తెలంగాణ) : జనగామ నియోజకవర్గ కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మధ్య వర్గపోరు తీవ్రమవుతున్నది. చేర్యాల మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం కుమారుడు కిరణ్‌కుమార్ గౌడ్ నియోజకవర్గంలోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించి ఆయా గ్రామాలకు వెళారు. లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడిగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కాదని కిరణ్‌కుమార్ చెక్కులు పంపిణీ చేయడం ఆయన వర్గీయులకు మింగుడుపడలేదు. తాజాగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సీఎం, ఎంపీ సహకారంతో జనగామ, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట, దూల్మిట్ట, చేర్యాల మండలాలకు 24 మందికి మంజూరైన రూ.10లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నట్టు ప్రకటించారు. చెక్కులు అందుకునేందుకు లబ్ధిదారులు పెద్దఎత్తున చేరుకోగా.. తమ నాయకుడు కొమ్మూరికి సమాచారం లేకుండా పోటీగా కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ఆయన వర్గీయులు కిరణ్ కుమార్ చెక్కుల పంపిణీని అడ్డుకొని గొడవకుదిగారు. గాయత్రి గార్డెన్‌లో చెక్కుల పంపిణీ చేసేందుకు నాగపురి వర్గీయులు సిద్ధపడగా.. అక్కడ కూడా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలను చెదరగొట్టి నాగపురి కిరణ్‌కుమార్‌ను అక్కడి నుంచి పంపించివేయడంతో గొడవ సద్దుమణిగింది. శామీర్‌పేటలోని మాజీ ఎంపీటీసీ మహేందర్ ఇంటి వద్ద నాగపురి కిరణ్ చెక్కుల పంపిణీ పూర్తిచేశాడు. బచ్చన్నపేట మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి డబ్బులు డిమాండ్ చేశాడని..లేవని చెప్పడంతో చెక్కు ఇవ్వకుండా వెళ్లిపోయారని కొన్నెకు చెందిన కరోళ్ల జ్యోతితో కొమ్మూరి వర్గానికి చెందిన జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్ జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాడు.

## చెన్నూర్‌లో ఎమ్మెల్యే ముందే కొట్టుకున్న కాంగ్రెసోళ్లు



మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ ముందే కాంగ్రెసోళ్లు కొట్టుకున్నరు. సంస్థాగత ఎన్నికల పరిశీలకులు రాఘవరెడ్డి, రాంభూపాల్ పాల్గొన్నారు. పదవుల కోసం నేతల పేర్లు ప్రస్తావిస్తుండగా, ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు, షాడో ఎమ్మెల్యే వర్గం, మరో వర్గం గొడవకు దిగారు. -చెన్నూర్ రూరల్

## అంబటి కృష్ణమూర్తి, సంజీవరెడ్డి వర్గీయుల ఘర్షణ



బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించేందుకు వచ్చిన అంబటి కృష్ణమూర్తి, నాయకులపై సంజీవరెడ్డి వర్గానికి చెందిన ఐఎన్‌టీయూసీ నేతలు చంద్రశేఖర్, ఆదిల్ షరీఫ్ , నరసింహారెడ్డి దాడిచేశారు. పోలీసులు సంజీవరెడ్డి వర్గీయులను తరిమికొట్టారు. కృష్ణమూర్తి ఆబిడ్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. -రవీంద్రభారతి

## కరెంట్ షాక్‌తో రైతు దుర్మరణం

- నంచర్లలో చెట్ల కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదం



పెగడపల్లి, మే 19: చెట్ల కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా నంచర్ల సమీపంలో జరిగింది.సోమవారం విద్యుత్తు సిబ్బంది వైర్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టారు. కొంత మంది రైతులతో కలిసి అక్కడికి వెళ్లిన ఎడ్ల రాజేందర్‌రెడ్డి (43), ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు అడ్డుగా ఉన్న ఒక చెట్టు కొమ్మను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి షాక్‌కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో జగిత్యాల దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుత్తు సరఫరాను నిలిపి వేయకుండా పనులు చేపట్టడం వల్లే తన భర్త చనిపోయాడని రాజేందర్‌రెడ్డి భార్య విజయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడీఈ వరుణ్‌కుమార్, ఏఈ మధు, మార్కెట్ చైర్మన్ రాములుగౌడ్, నంచర్ల సింగిల్ విండో చైర్మన్ వేణుగోపాల్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



### రైస్ మిల్లు ఎదుట రైతుల నిరసన

మిల్లర్ సన్న వడ్లను దించుకోవడం లేదంటూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని వెంకటలక్ష్మి మిల్లు ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. మిల్లు గేటు మూసి నిరసన తెలిపారు. అక్కడికి వచ్చిన జిల్లా పౌరసరఫరాల అధికారిని నిలదీశారు. ధాన్యం తీసుకోవాలని మిల్లు యాజమాన్యాన్ని అధికారి ఆదేశించినట్టు రైతులు తెలిపారు. - తొర్రూరు